సాక్షి
గుంటూరు
బుధవారం । 28 । ఆగస్టు । 2024



మొక్కల పెంపకంపై స్థల పరిశీలన

ఫిరంగిపురం: 113త్యాళ్లూరు గ్రామంలో మొక్కల పెంపకం కోసం పలు ప్రభుత్వ స్థలాలను జెడ్పీ సీఈఓ వసంతరాయుడు, డీపీఓ శ్రీదేవి మంగళవారం పరిశీలించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నీటినిల్వ 45.46 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 45185 క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 57876 క్యూసెక్కులు వదులుతున్నారు.

మంగళ గౌరీగా బండ్లమ్మ దర్శనం



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువై ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని మంగళగౌరీగా అలంకరించారు.

న్యూస్‌రీల్

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి



తెనాలిరూరల్: తెలుగు భాషాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తెనాలిలో న్యాయమూర్తి తెలుగులో తీర్పు చెప్పారు. తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ ఓ కేసుకు సంబంధించిన తీర్పును తెలుగులో చెప్పారు. వేమూరి భిక్షాలు, వేజండ్ల విక్రమ్‌ల మధ్య ఆర్థిక లావాదేవీల కేసు నడుస్తోంది. కేసు మంగళవారం విచారణకు రావడంతో న్యాయమూర్తి పవన్‌కుమార్ సాక్ష్యాధారాలను పరిశీలించారు. భిక్షాలుకు విక్రమ్ రూ. 3,75,666 చెల్లించాలని తీర్పు తెలుగులో చెప్పారు. ఈ వారమంతా రోజుకో తీర్పు తెలుగులో చెప్పనున్నట్టు న్యాయమూర్తి తెలిపారు.

హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూలులో 230మందికి శిక్షణ

17వ బ్యాచ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి



నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రభుత్వం నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ స్కూలులో ఇప్పటివరకు 230మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం వెల్లడించారు. మంగళవారం డిపోలో 16వ బ్యాచ్ శిక్షణ పూర్తిచేస్తున్న 16మంది అభ్యర్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. 17వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం కాబోతుందని, దీనిలో చేరే లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు సీట్లకోసం 7382896038, 7382896158, 9959225428 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జీఎన్‌ఎం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్‌ఎం) సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం గుంటూరు వైద్య కళాశాలలో ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 - మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 - సాయంత్రం 5 గంటల వరకు జరిగాయి. సెప్టెంబర్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లావ్యాప్తంగా అప్లై చేసుకున్నవారిలో 550 మంది రాగా, 30 మంది గైర్హాజరయ్యారు. చీఫ్ ఎగ్జామినర్‌గా జీజీహెచ్ సివిల్ సర్జన్, ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, అబ్జర్వర్‌గా నర్సింగ్ కళాశాల లెక్చరర్ వెంకట రమణ వ్యవహరిస్తున్నట్లు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ సుజాతరాణి తెలిపారు.

14న జిల్లాలో 'జాతీయ లోక్ అదాలత్'

నగరంపాలెం: సెప్టెంబరు 14న జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం జిల్లా అంతటా లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కక్షిదారులు, పోలీసులు, స్టేక్ హోల్డర్లు ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలని పేర్కొన్నారు.

ఇసుక ఆన్‌లైన్ విధానం పరిశీలన



తాడికొండ: తుళ్ళూరు మండలంలో కొనసాగుతున్న ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ విధానాన్ని గురువారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ పరిశీలించారు. ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.గంగరాజుతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో ఈ విధానం గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పలువురు లారీ ఓనర్లు, డ్రైవర్లకు సూచనలిచ్చారు. తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు, తుళ్ళూరు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నందున చేసుకున్న వెంటనే డిజిటల్‌గా నగదు చెల్లించాలని సూచించారు. ప్రధాన రహదారిలో లారీలతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. త్వరలో నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలలో ఇసుక బుకింగ్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు.



రేయింబవళ్లు రక్షణ కల్పించాలి

సాధారణంగా పీహెచ్‌సీలు జనావాసాలకు కొంత దూరంగా ఉంటున్నాయి. మహిళా వైద్యులు, సిబ్బంది రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కోల్‌కతా ఘటన తరువాత భయంగా ఉటోంది. పీహెచ్‌సీల వద్ద 24 గంటలూ రక్షణ ఏర్పాట్లు చేయాలి. దాడుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. వైద్య సిబ్బందికి ఉన్న ప్రాధాన్యం, వారి రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించాలి.

- డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, మున్నంగి పీహెచ్‌సీ



కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే



కోల్‌కతా ఘటన హేయమైన చర్య. మండలాల్లో రాత్రి వేళ వైద్యులు, ఇతర సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. చికిత్స అవసరం లేని వారు, మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు ఆలోచనా శక్తి కోల్పోయి ఏదో చేయాలని ఆస్పత్రిలోకి చొరబడుతుంటారు. కోల్‌కతా వంటి దారుణ ఘటనలు జరగకుండా ఆస్పత్రి వ్యవస్థలో మార్పులు రావాలి. ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. ప్రతి స్త్రీని అమ్మగా, సోదరిగా చూడాలి. హత్యాచార దోషులకు తగిన శిక్ష విధించాలి.

- డాక్టర్ వేముల ప్రియాంక, మున్నంగి పీహెచ్‌సీ

ఇక్కడా అదే చంద్రం!

కూటమి గెలిచింది.. అన్నిచోట్లా తెలుగు తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. నాలుగు రూపాయలు వస్తే చాలన్నట్లు ఉంది వారి వైఖరి. నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘించేస్తున్నారు. ప్రజలకు ఎంత ఇబ్బంది కలిగినా కనీసం ఆలోచన లేకుండా వ్యవహరిస్తున్నారు. గెలిచి మూడు నెలలు కాకముందే తెలుగు తమ్ముళ్లు చేస్తున్న దందాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. అదే కోవలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే భర్త తీరు కూడా ఇప్పుడు తెరపైకి వచ్చింది.

- వివాదంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే భర్త
- బాధితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు
- భూముల కొనుగోలులో పలు అక్రమాలు
- ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్న రైతులు
- పేకాట నిర్వాహకులకు అన్నివిధాలా అండ
- నార్త్ క్లబ్ నుంచి దర్జాగా రోజువారీ కానుల వసూళ్లు
- కొమ్ము కాస్తున్న పట్టాభిపురం పోలీసులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: భూ వివాదంలో చిక్కుకుని బాధితులపై దాడులు చేయడం, వారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడంతో ఎమ్మెల్యే భర్త వ్యవహారం గుంటూరు నగరంలో కలకలం రేపుతోంది. పశ్చిమ ఎమ్మెల్యేగా గళ్లా మాధవి గెలిచినా పెత్తనం మొత్తం ఆమె భర్త రామచంద్రరావు కనుసన్నల్లోనే నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. బదిలీలైనా, పేకాట విషయంలోనైనా ఆయన చెప్పిందే అమలు అవుతోంది.

అక్రమాల్లోనూ 'తోడు'

తన చిన్ననాటి స్నేహితుడినే పట్టాభిపురం స్టేషన్ అధికారిగా తీసుకురావడంతో ఆయన పూర్తిగా ఎమ్మెల్యే భర్తకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం పట్టాభిపురం పోలీసుస్టేషనులో ఒక ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ కేసు విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించటంతో పాటు గళ్లా రామచంద్రరావుకు అనుకూలంగా వ్యవహరించడం వివాదం రేపింది. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన కమ్మ వెంకటరావుకు, గళ్లా రామచంద్రరావుకు మధ్య రియల్ ఎస్టేట్ లావాదేవీలున్నాయి. ఈ వ్యవహారంలో తేడాలు రావడంతో ఆయనతోపాటు కుమారుడిపైనా రామచంద్రరావు అనుచరులు దాడి చేశారు. అనంతరం పట్టాభిపురం సీఐతో మాట్లాడి బాధితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా రామచంద్రరావు ఒత్తిడితో బాధితులపైనే తప్పుడు కేసు నమోదు చేయడం గమనార్హం. బాధితుల ఇంటికి వెళ్లి మరీ బెదిరించడం పోలీసు వర్గాలలో కూడా చర్చనీయాంశంగా మారింది. పట్టాభిపురం పోలీసులు స్పందించకపోవడంతో బాధితులు నేరుగా గుంటూరు రేంజి డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీకి ఫిర్యాదు చేశారు. మరోవైపు బాధితులకు బెదిరింపులు ఆగకపోవడంతో కోర్టును కూడా ఆశ్రయించారు. ఈ వివాదంతో పట్టాభిపురం సీఐపై చర్యలకు ఉన్నతాధికారులు సన్నద్ధం అయినట్లు సమాచారం.

అధిష్ఠానానికి ఫిర్యాదులు

మరోవైపు రామచంద్రరావు వ్యవహారంపై ఆ పార్టీ వారే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అంతే కాకుండా గుంటూరులోని నార్త్‌క్లబ్‌లో పేకాట వ్యవహారం కూడా వివాదాస్పదమైంది. ఆ క్లబ్ నుంచి రోజూ మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆ క్లబ్‌కు ఏ ఇబ్బంది రాకుండా అండగా నిలబడినట్లు కూడా ఫిర్యాదులు వెళ్లాయి.

రైతులను నట్టేట ముంచి...

గతంలో కూడా భ్రమరా పేరుతో పిడుగురాళ్లలో వెంచర్ వేసిన వీరు రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొనుగోలు చేశారు. రూ.లక్షల వంతున ప్లాట్లు అమ్మకాలు జరుపుతున్నారు. వీరు సేకరించిన భూములలో ఎక్కువ బీఫాంతోపాటు 22 ఏ(చుక్కల) భూములు ఉన్నట్లు సమాచారం. మార్కెట్ ధర కంటే చాలా తక్కువకు రైతుల నుంచి పొందినట్లు తెలిసింది. కొందరు రెవెన్యూ అధికారుల సహాయసహకారాలతో తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించారని సమాచారం. అన్ని అనుమతులు ఉన్నట్లు కలరింగ్ ఇచ్చి వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. 892/2 సర్వే నెంబర్‌లో సుమారు 47.60 ఎకరాలు 22ఏ (చుక్కల భూమి) లిస్టులో ఉన్నప్పటికి పక్కా రిజిస్ట్రేషన్ అయినట్లు పత్రాలు సృష్టించారు. పాట్లు వేసి యథేచ్ఛగా అమ్మకాలు నిర్వహించారు. శ్రీ భ్రమరా వెంచర్ వద్ద చిన్న, సన్నకారు రైతుల పొలాలకు దారులు లేకుండా చేశారు. అడ్డంగా ప్రహరీ నిర్మించారు. ఇదేమని రైతులు ప్రశ్నిస్తే 'మీరు విక్రయించారు. మేం కొన్నాం, ఇది దారి కాదు. మీరు ఇటుగా నడవొద్దు' అంటూ రైతులకు హుకుం జారీ చేశారు. పక్కన ఉన్న పొలాలకు నీరు పెట్టేందుకు ఉన్న కాలువలను సైతం పూడ్చి గోడలు నిర్మించారు. దీనిపై పిడుగురాళ్లలో పలు ఫిర్యాదులు ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక వారందర్నీ బెదిరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై తెలుగుదేశం అధిష్ఠానం కూడా సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.

పేదల ఇళ్లను వేగంగా నిర్మించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం నిర్మించే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, అర్బన్ గృహాల నిర్మాణం లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గృహాల నిర్మాణానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. రైతుల అంశాల్లోనూ వేగంగా స్పందించాలన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా పటిష్ట చర్యలు తప్పనిసరని చెప్పారు. ఈ నెల 30న నిర్వహించే వన మహోత్సవం, పంట కాల్వల నిర్మాణం, తదితర పనుల పురోగతిని ఎంపీడీఓలు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జేసీ భార్గవ్ తేజ్ మాట్లాడుతూ ఈ-పంట నమోదు, ఈకేవైసీ ఈ నెల 31లోపు పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ విలువల పెంపుదలకు సంబంధించిన అన్ని వివరాలు సేకరించాలన్నారు.

ప్రయోగ సృష్టి.. సృజనపై దృష్టి

- ఇన్‌స్పైర్ మానక్ వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు
- వైవిధ్య ప్రాజెక్టుల రూపకల్పనకు కేంద్రం ప్రోత్సాహం
- వివరాల నమోదుకు సెప్టెంబర్ 15 వరకు గడువు
- ప్రతి బడి నుంచి విద్యార్థులు పాల్గొనాలని విద్యాశాఖ ఆదేశాలు





ఇన్‌స్పైర్ మానక్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రాజెక్టుల విశేషాలను వివరిస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి కేంద్రం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం 'ఇన్‌స్పైర్ మానక్ వైజ్ఞానిక ప్రదర్శనలు' నిర్వహిస్తోంది. చిట్టి బుర్రల్లో నూతన ఆలోచనలను రేకెత్తించి, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సరికొత్త ఆలోచనలతో పరిష్కారం కనుగొనేలా విద్యార్థులను నూతన ఆవిష్కరణల దిశగా కేంద్రం ప్రోత్సహిస్తోంది. పాఠశాల స్థాయిలో వారి మనస్సుల్లో బీజం వేసే బాధ్యతను ప్రధానోపాధ్యాయులతోపాటు సైన్స్ ఉపాధ్యాయులకు అప్పగించింది. 2024-25 విద్యాసంవత్సరానికి రిజిస్ట్రేషన్లను ప్రారంభించిన కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్‌టీ) ఆన్‌లైన్‌లో ప్రాజెక్టు నివేదికలను ఆహ్వానిస్తోంది. విద్యా, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, అంతరిక్ష, వైద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాల వారీగా నూతన ఆవిష్కరణల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల్లోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో మూడు చొప్పున ప్రాజెక్టులను రిజిస్టర్ చేయించాల్సి ఉంది. ఇందుకు ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించేందుకు సైన్స్ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించాలి. రిజిస్ట్రేషన్ గడువు సెప్టెంబర్ 15 వరకు ఉంది. ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లతోపాటు గుర్తింపు పొందిన ప్రయివేటు ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తాము ఎంచుకున్న ప్రాజెక్టు పేరు, దాని వల్ల సమాజానికి, మేలు వంటి అంశాలతో ప్రాజెక్టు నివేదికను గైడ్ టీచర్ సహాయంతో సిద్ధం చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనల ద్వారా ప్రతిభ చాటేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

ఏటా 2,500కుపైగా రిజిస్ట్రేషన్లు

ఈ ప్రదర్శనకు గుంటూరు జిల్లాలో ఏటా 2,500కు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, వీటిలో 350కు పైగా ప్రాజెక్టులు ఎంపికవుతున్నాయి. పలువురు జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి సైతం ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్-డీఎస్‌టీ.జీవోవీ.ఇన్ సైట్‌కు లాగిన్ అయ్యి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థి పేరు, పాఠశాల, చదువుతున్న తరగతి వివరాలతో పాటు ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా, పేరెంట్ జాయింట్ ఖాతా నంబర్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ తదితర వివరాలు నమోదు చేయాలి. సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలల సైన్స్ టీచర్లకు ఇటీవల ఓరియెంటేషన్ ప్రోగ్రాం కూడా దీనికి సంబంధించి నిర్వహించారు. పూర్తి వివరాలను హెచ్‌ఎం, సైన్స్ టీచర్ల నుంచి విద్యార్థులు పొందవచ్చని అధికారులు తెలిపారు. విద్యార్థులు పంపిన ప్రాజెక్టులను పరిశీలించిన తరువాత వాటిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థికి తొలుత రూ.10 వేలు అందిస్తారు.

విద్యార్థులతో రిజిస్ట్రేషన్ చేయించాలి

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మానక్ ప్రోగ్రాంకు సంబంధించి జిల్లాలోని అన్ని యూపీ, హైస్కూళ్ల యాజమాన్యాలు విద్యార్థులకు సమాచారం ఇచ్చి, ఆసక్తి గల వారిని అన్నివిధాలా కచ్చితంగా ప్రోత్సహించాలి. తరగతి గదిలో చదువుతోపాటు విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి పరిచేందుకు ఈ కార్యక్రమంలో ఎంతో కీలకం. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని పాఠశాలలు వెంటనే ప్రాజెక్టులను సిద్ధం చేసి ప్రక్రియ ప్రారంభించాలి.

– పి.శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి

అత్యాశకు యాప్ వల..!

- వీసీఐ యాప్ వలలో చిక్కుకున్న వందల మంది
- అత్యాశకు పోయి రూ.లక్షల్లో ఉత్పత్తుల కొనుగోలు
- రోజువారీగా జమైన నగదు విత్‌డ్రా ఆప్షన్ నిలిపివేత
- రూ.80 లక్షల వరకు మోసపోయిన ప్రత్తిపాడు వాసులు



యాప్‌లో ఉంచిన ఉత్పత్తులు, ఆఫర్లు



రూ.77 వేలతో కొంటే రూ.6.60 లక్షలని ఆఫర్

ప్రత్తిపాడు : ఎంత మంది ఎన్ని చెప్పినా జనం మాత్రం చెవికెక్కించుకోరు. ఈజీ మనీ కోసం అత్యాశకు పోతుంటారు. ఆన్‌లైన్ మోసాల కోరల్లో చిక్కుకుంటారు. నిలువునా మోసపోయి నెత్తీనోరూ బాదుకుంటారు. చివరకు జేబులకు చిల్లు పెట్టుకుని లబోదిబోమంటూ విలపిస్తుంటారు. అలాంటి ఘటనే ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. వందల మంది యువకులు ఓ ఆన్‌లైన్ యాప్ వలలో చిక్కుకున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి రూ.లక్షల్లో సంపాదించుకోవాలని యత్నించి నష్టపోయారు. వీసీఐ షాప్ అనే పేరుతో ఉన్న ఓ లింక్‌ను ఓపెన్ చేసి యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. పెట్టుబడి పెట్టినా, ప్రోడక్టులు కొనుగోలు చేసినా అత్యధికంగా డబ్బులు వస్తున్నాయని నమ్మారు. రూ.500 నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెడితే ప్రతి రోజు ఆదాయం వస్తుందని యాప్‌లో చూపారు. గుడ్డిగా నమ్మారు ప్రజలు. ప్రొడక్టులు కొని ఇప్పుడు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రూ. 500 చెల్లిస్తే ప్రవేశం

యాప్‌లో పలు ఉత్పత్తులను రకరకాల ఆకర్షణీయమైన ఆఫర్లతో అందుబాటులో ఉంచారు. ప్రోడక్టు కొనుగోలు చేస్తే రోజుకు కొంత నగదు చొప్పున కొన్ని రోజులపాటు యాప్‌లోని వ్యాలెట్‌కు జమ అవుతాయని, ఆ నగదును విత్‌డ్రా చేసుకోవచ్చనేది ఆ యాప్ సారాంశం. తొలుత చేరాలంటే సభ్యులు రూ. 500 చెల్లించాలి. తర్వాత ప్రాసెస్ జరుగుతుంది. ఉత్పత్తులు రూ. 500 నుంచి రూ. లక్ష వరకు ఉంటాయి. ఉదాహరణకు రూ. 77 వేలు చెల్లించి ఒక ఉత్పత్తి కొంటే 78 రోజులపాటు రోజుకు రూ. 8,470 చొప్పున రూ. 6,60,660 వస్తాయని యాప్‌లో ఆఫర్ కింద చూపారు. ఇలా రకరకాల ఆఫర్లతో ప్రోడక్టులు ఉంటాయి. తొలుత కొద్ది రోజులు సక్రమంగానే ఉత్పత్తులు కొనుగోలు చేసిన వారి వ్యాలెట్‌కు డబ్బులు జమ అయ్యాయి. వారం రోజులుగా యాప్‌లో విత్ డ్రా ఆప్షన్‌ను నిలిపి వేశారు. దీంతో బాధితులంతా బోరుమంటున్నారు. నిర్వాహకులు మరో యాప్‌ను సిద్ధం చేశారు. పాత యాప్‌లో పెట్టుబడులు పెట్టిన వారు ఇందులోనూ ఉత్పత్తులు కొంటే పాత దాంట్లోని నగదును విడతలవారీగా ఇస్తామంటూ మరో మోసానికి తెరలేపారు.

అప్పులు చేసి మరీ...

బాధితుల్లో ఎక్కువమంది యువత, ఆటోవాలాలు, చిరు ఉద్యోగులే. డబ్బులు ఆశ చూపించడంతో వడ్డీలకు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. ప్రత్తిపాడులోని ఓ బంకులో పనిచేస్తున్న యువకుడికి పెద్ద మొత్తంలో డబ్బులు ఈ యాప్ ద్వారా వచ్చాయన్న ప్రచారంతోపాటు ఆ డబ్బుకు తనది పూచీ అని అతడిచ్చిన భరోసా కారణంగా వందల మంది ఈ ట్రాప్‌లో చిక్కుకున్నారు. ఇప్పుడు వారి పరిస్థితి దారుణంగా ఉంది. ఒక్క ప్రత్తిపాడులోనే రూ. 60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఈ యాప్‌లో పెట్టినట్లు సమాచారం

ఉపాధ్యాయురాలి బదిలీపై నిరసన



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడేపల్లి రూరల్: విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయురాలి బదిలీపై విద్యార్థులు ఆగ్రహించారు. రెండు గంటలపాటు రోడ్డుపై బైటాయించారు. ఉపాధ్యాయులు వారిని బుజ్జగించి తరగతి గదులకు తరలించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్లం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1,200 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ముగ్గురు టీచర్లు సోషల్ బోధిస్తున్నారు. వారిలో ధూళిపాళ్ల పద్మజ ఇక్కడికి వచ్చి ఐదేళ్లు మాత్రమే అయినా బదిలీ చేశారు. ఎనిమిదేళ్లు పనిచేయాల్సి ఉంది. పైగా 100 మంది కూడా లేని ఉండవల్లి యూపీ పాఠశాలకు బదిలీ చేయడంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులను, పేరెంట్స్ కమిటీ వారిని కలిసినా బదిలీ ఆగలేదని వాపోయారు. బదిలీ రద్దుకు ధర్నా చేశారు.

అయ్యో్యారు.. తప్పని బేజారు..

బరమ్స్‌తో జిల్లా అధికారులకు అవస్థలు



త్వరగా.. త్వరగా...: కారు నుంచి బయటకు దిగుతున్న జడ్పీ సీఈవో



గట్టిగ పట్టు హైలెస్సో...: కారుకు పెద్ద మోకులు కట్టి ట్రాక్టర్‌తో లాగిస్తున్న సర్పంచి

ప్రత్తిపాడు: జిల్లా ఉన్నతాధికారులు ఎరక్కపోయి వచ్చి ఇరుక్కున్నారు. ప్రత్తిపాడు మండలం కొత్త మల్లాయపాలెం పర్యటనకు జిల్లా పరిషత్ సీఈవో వసంతరాయుడు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి తదితరులు వచ్చారు. కారులో గ్రామంలో పర్యటిస్తున్న సమయంలో ఓ వీధిలో సిమెంటు రోడ్డుకు ఇరువైపులా వేసిన సైడ్ బరమ్స్ కుంగిపోవడంతో కారు ఒక్కసారిగా పూర్తిగా పక్కకు ఒరిగిపోయింది. దీంతో జెడ్పీ సీఈవో, డీపీవోలు దిగారు. అనంతరం కారును బయటకు తీసేందుకు సిబ్బంది నానా తిప్పలు పడ్డారు. అయినప్పటికీ ఫలితం దక్కలేదు. గ్రామ సర్పంచి లక్ష్మారెడ్డి, స్థానికుల సహకారంతో ట్రాక్టరును పిలిపించారు. కారుకు మోకులు కట్టి అర గంటపాటు శ్రమించి కారును బయటకు లాగించారు. మధ్యలో ఓసారి చిన్న మోకులు తెగిపోవడంతో పెద్దవి తీసుకొచ్చారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

రక్షణ చట్టాలు అవసరం



మహిళలకు రక్షణ చట్టాలు అవసరం. ఇలాంటి సంఘటనలు మహిళల్లో మరింత అభద్రతాభావం కలుగజేయటమే కాకుండా భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి. ఉద్యోగం నరక ప్రాయం కాకూడదు. సహోద్యుగులు, విధులు నిర్వహించే ప్రాంతం స్నేహ పూర్వక వాతావరణం ఉన్నప్పుడే ఉద్యోగం స్వేచ్ఛగా చేయగలుగుతాం. అలాంటి వాతావరణం మహిళకు కల్పిస్తే ముందుకు పోగలుగుతాం. ఆటంకాలు ఎదురైతే విధులు నిర్వహించడం అసాధ్యమవుతుంది. పెనుమాక శాంతి, స్టాఫ్ నర్స్, చినగంజాం పీహెచ్‌సీ

మహిళలకు భరోసా కల్పించాలి



ఆధునిక యుగంలో అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని ప్రభుత్వాలు ఎంతో ప్రచారం చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాలి. నేరాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు భరోసా కల్పించాలి. ఎంతో భవిష్యత్తు ఉన్న కోల్‌కతా యువతి ఇంత దారుణంగా ప్రాణాలు కోల్పోవాల్సి రావడం అత్యంత బాధాకరం. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. – డాక్టర్ రాజేష్, మెడికల్ ఆఫీసర్, యర్రబాలెం

క్లుప్తంగా

కేంద్ర పెన్షన్ పథకంపై హర్షం



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): కేంద్ర ఉద్యోగుల కోసం యునైటెడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) అమలు చాలా సంతోష దాయకమని గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. గుంటూరు పట్టాభిపురంలోని కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ స్కీం వల్ల డివిజన్ పరిధిలో 4,707 మంది దాదాపు 3,750 మంది ప్రయోజనం పొందుతారన్నారు. 2004 తర్వాత చేరిన ఉద్యోగులకు ఎక్కువ మేలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ సీనియర్ డీపీఓ షేక్ షహబాజ్ హనూర్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్, సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, డీసీఎం కె.కమలాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలి

గుంటూరు మెడికల్: ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల రెన్యువల్, కొత్త రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. సంబంధిత డాక్యుమెంట్లు అప్లోడ్ చేసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలకు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని వెల్లడించారు. రిజిస్టర్ చేయించుకోకుండా నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఆ సెంటర్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కక్ష కట్టి శ్రీకృష్ణుడి విగ్రహం తొలగింపు

అనుమర్లపూడి గ్రామంలో అధికారుల అత్యుత్సాహం

పెదకాకాని: దేశవ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు జరుగుతుండగా అనుమర్లపూడిలో మాత్రం ప్రతిష్ఠించిన కన్నయ్య విగ్రహాన్ని తొలగించారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఎదుట రోడ్డుకు, డ్రైనేజీ కాలువకు మధ్య మార్జిన్‌లో సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించారు. పూజలు చేశారు. విగ్రహం పెట్టుకునేందుకు 2022లోనే పంచాయతీలో తీర్మానం కూడా పూర్తయింది. విగ్రహం ఏర్పాటును వ్యతిరేకించిన కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన నాటకీయ పరిణామాలు, చర్చల అనంతరం విగ్రహం తొలగించేందుకు సిద్ధం అయ్యారు. ప్రతిష్ఠించిన వారే తొలగించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని సంతకాలు చేసే పరిస్థితి ఏర్పడింది. అదేరోజు రాత్రి 10 గంటల తరువాత లైట్లు ఆర్పి అర్చకుల వేదమంత్రాల సాక్షిగా విగ్రహాన్ని తొలగించారు. పూజా సామగ్రి సమీపంలోని చెరువులో వేసి, విగ్రహాన్ని శివాలయంలో పెట్టించారు. గ్రామంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది.



పూజలు అందుకున్న విగ్రహం



తొలగించిన తర్వాత దృశ్యం



కన్నతల్లికే కనుపాపలై...

ఈ చిత్రం గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డులో చూపరుల హృదయాన్ని హత్తుకుంది. స్కూల్ నుంచి వచ్చిన చిన్నారులు తమ హోం వర్క్‌ను పూర్తి చేసుకుని అమ్మకు విశ్రాంతి ఇచ్చేందుకు యూనిఫామ్‌లోనే నేరుగా పూలను విక్రయిస్తూ కనిపించారు.
– సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు

రాష్ట్రస్థాయి పోటీలకు విజ్ఞాన్ నిరుల విద్యార్థిని


గుంటూరు రూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ కళాశాల విద్యార్థిని ఎంపికవ్వటం ఎంతో సంతోషంగా ఉందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక తెలిపారు. మంగళవారం పెదపలకలూరు గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. బీటెక్ తొలి ఏడాది విద్యార్థిని షేక్ షేహనాజ్‌బీ జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో అండర్ 20 విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడలలో కూడా విద్యార్థినులు రాణించటం గర్వంగా ఉందన్నారు. షేహనాజ్‌బీని కళాశాల బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ టీవీఎస్ ప్రసన్న, పీడీ కిషోర్‌కుమార్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు తదితరులు అభినందించారు.



షేక్ షేహనాజ్‌బీని అభినందిస్తున్న దృశ్యం

సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7,026 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 320, బ్యాంక్ కెనాల్‌కు 1,834 , తూర్పు కెనాల్‌కు 690, పశ్చిమ కెనాల్‌కు 155 , నిజాంపట్నానికి 390, కొమ్మమూరు కాలువకు 3,120 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



తొలిదశలోనే క్యాన్సర్ గుర్తింపునకు టెక్నాలజీ

ఎయిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ రేఖపల్లి రాజశేఖర్

తాడేపల్లి రూరల్: క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించే టెక్నాలజీ త్వరలో భారత్‌లో అందుబాటులోకి రానుందని మంగళగిరి ఎయిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ రేఖపల్లి రాజశేఖర్ అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో జాతీయస్థాయి ట్రెండ్స్ ఇన్ ఎపిజెనిక్స్ ఇన్ క్యాన్సర్ డయాగ్నోసిస్, థెరపీ పేరుతో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బయోటెక్నాలజీతో కృత్రిమ మేధస్సును అనుసంధానం చేయడం ద్వారా రక్తంలో క్యాన్సర్ కణాలు ముందుగానే గుర్తించి రోగుల ప్రాణాలను కాపాడేందుకు భారత్‌లో శాస్త్రవేత్తలు స్వదేశీ పరిజ్ఞానంతో నూతన టెక్నాలజీకి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. వర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలను, ఇండస్ట్రీ భాగస్వాములను, విద్యార్థులకు ఒకే వేదికపైకి చేర్చామని అన్నారు. తద్వారా క్యాన్సర్‌పై జరుగుతున్న పరిశోధనలలో మంచి ఫలితాలను రాబట్టవచ్చునని అన్నారు. 2023 ఐసీఎమ్మార్ నివేదిక ప్రకారం రానున్న కాలంలో క్యాన్సర్ గణనీయంగా పెరుగుతుందని అన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం. జానకిరామయ్య మాట్లాడుతూ క్యాన్సర్‌ను సమూలంగా నిర్మూలించాలనే కార్యాచరణతో ఏఎస్ఆర్ఎఫ్, కేంద్ర పరిశోధనా సంస్థ అయిన సెర్బ్ ఆర్థిక సహకారంతో ఈ జాతీయ సదస్సును నిర్వహించామన్నారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ రాయల సురేష్ కుమార్ మాట్లాడుతూ... క్యాన్సర్ బయో మార్కర్ల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్లు డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, అకడమిక్స్ డాక్టర్ కె. రాజశేఖరావు, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ అంజనాదేవి (హైదరాబాద్), డాక్టర్ షేక్ నౌషద్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం. జానకి రామయ్య, బయో టెక్నాలజీ విభాగాధిపతి, కో కన్వీనర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కోశాధికారులు కోటేశ్వరరెడ్డి, జ్ఞానశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న రాజశేఖర్

ఫోన్లకు దూరమై పుస్తకాలకు దగ్గరవ్వాలి

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంటూ పాఠ్య పుస్తకాలతో గడపడం ద్వారా జీవితంలో లక్ష్యాన్ని చేరుకోగలరని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రాసంశెట్టి నరసింహారావు అన్నారు. వెంగళరావునగర్‌లోని నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసింహారావు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. స్మార్ట్‌ఫోన్లకు చాలామంది బానిసలుగా మారిపోతున్నారని అన్నారు. గేమ్స్ కారణంగా మానసిక సమస్యల బారిన పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని జయించిన వారే చదువులోను, ఉద్యోగంతోపాటు జీవితంలోనూ రాణిస్తారని తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో అధ్యక్షుడు ముట్లూరు వెంకయ్య మాట్లాడుతూ.. మదర్ థెరిసా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ప్రతిభవంతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.రమేష్, క్లబ్ సభ్యులు గోపిదేసి మల్లికార్జునరావు, మల్లికార్జున, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ జంగం జాషువా, సభ్యులు ఆరుమల్ల చెంచు, షేక్ జరీనా, మురికిపూడి దీప్తి, చిందు నరేష్ కుమార్, వై.పవన్‌కుమార్, తాడిగిరి పీటర్‌పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా వేషధారణలోని చిన్నారులతో నరసింహారావు, హెచ్ఎం రమేష్ తదితరులు

మహిళలతో మర్యాదగా మెలగాలి



కానిస్టేబుల్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల (పీఎస్)కు వచ్చే మహిళా ఫిర్యాదిదారులతో గౌరవంగా మెలగాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లాలోని పలు పీఎస్‌ల్లో ఐదేళ్ల పూర్తయిన కానిస్టేబుళ్లకు రెండో విడత బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళల అర్జీలను ఆలకించి, న్యాయం చేకూరేలా చూడాలని అన్నారు. పీఎస్‌ల్లోని సహాచర సిబ్బందితో కుటుంబ సభ్యుల వలె విధులు నిర్వహించాలని చెప్పారు. స్టేషన్ పరిధిలో ఎల్అండ్ ఓ, క్రైం, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), వెంకటేశ్వరరావు (సెబ్), ఎస్బీ సీఐలు అళహరి శ్రీనివాసరావు, ఆనంద్, డీపీఓ ఏఓ వెంకటేశ్వరరావు, సిసి ఆదిశేషు, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ.బ్రహ్మానందం పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త



పట్నంబజారు: అనుమానం పెనుభూతమై భార్యను భర్త హతమార్చిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరు రాఘవనగర్‌కు చెందిన అచ్చి అంకమ్మరావు అలియాస్ అభిరామ్ 11 సంవత్సరాల క్రితం మణిపురం ఒకటో లైనుకు చెందిన మాచవరపు మౌనిక (24)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు సంతానం. అంకమ్మరావు నిత్యం మద్యం తాగొచ్చి అనుమానంతో ఆమెను వేధింపులకు గురిచేసేవాడు. ఈ నెల 26వ తేదీ రాత్రి కూడా తాగొచ్చి గొడవకు దిగాడు. క్రికెట్ బ్యాట్ తీసుకుని ఆమెను తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మౌనిక మంగళవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో వై. వీరసోమయ్య ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మౌనిక తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సహాయ కమిషనర్ స్థాయి అధికారిని ఈవోగా నియమించాలి

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయానికి సహాయ కమిషనర్ స్థాయి అధికారిని ఈవోగా నియమించి గుడి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ నాయకుడు, ఆలయ పాలకవర్గ మాజీ సభ్యుడు నేరెళ్ళ హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సుమారు ఆరు నెలల క్రితం దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఈ మేరకు స్థాయి ఇచ్చారన్నారు. బదిలీలలో భాగంగా మళ్లీ గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారిని కాకుండా సహాయ కమిషనర్ స్థాయి వారిని నియమించాలని భక్తుల తరఫున కోరుతున్నట్లు చెప్పారు. కోర్టు వివాదాల పరిష్కారం, ఆలయ నిర్వహణ, ఆధ్యాత్మిక కార్యక్రమాల దృష్ట్యా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఎన్ఆర్ఐ కోటాలో దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ఎన్ఆర్ఐ కోటాలో పలు కోర్సులకు దరఖాస్తులను రెండవ సారి ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు మంగళవారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గానూ బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్ఆర్ఐ కోటాలో ఈ నెల 28 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

మహిళపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుల అరెస్ట్

నాదెండ్ల: ఒంటరి మహిళపై లైంగికదాడి జరిపి దారుణంగా హత్య చేసిన నిందితులను మంగళవారం నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్ఐ జి.పుల్లారావు విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. గణపవరం శివాలయం వీధిలో నివాసం ఉండే షేక్ మస్తాన్‌బీ (45) భర్త మరణించటంతో కొంతకాలంగా అదేవీధిలో ఉంటున్న పీర్లచావిడిలో నివాసం ఉంటోంది. ఒడిశా రాష్ట్రం, బద్రక్ జిల్లా, ఫతేపూర్ మండలం, లెంతార్ గ్రామానికి చెందిన మనోజ్‌మాలిక్ అలియాస్ రాజుమాలిక్ కొంతకాలంగా గణపవరంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ వివిధ పరిశ్రమల్లో ముఠా పనులకు వెళ్లేవాడు. అయితే అక్కడ అద్దె చెల్లించకపోవటంతో ఖాళీ చేయించారు. దీంతో తమ మేస్త్రీ గాజుల మేరయ్య సాయంతో పీర్లచావిడిలో ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదిన అర్ధరాత్రి సమయంలో స్థానికంగా ఉండే ఎం.సాంబశివరావుతో కలిసి మద్యం, గంజాయి సేవించారు. రాజుమాలిక్ పీర్లచావిడీలోని మరో గదిలో నిద్రిస్తున్న మస్తాన్‌బీని చీరతో గొంతునులిమి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆపై హత్యచేసి పరారయ్యాడు. మంగళవారం రాజుమాలిక్, సాంబశివరావు ఇద్దరూ గణపవరం నుంచి నాదెండ్ల వెళ్లే డొంక రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఇరువురినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నిందితులను అరెస్టు చేయటంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ సుబ్బానాయుడు అభినందించారు.

భవిష్యత్తులో అన్ని రంగాలపైనా ఏఐ ప్రభావం

జెన్ ఏఐ పయనీర్ సీఈవో దేసు ఉమా

గుంటూరు రూరల్: భవిష్యత్తులో ఏఐ అన్ని రంగాలను శాసించనుందని జెన్ ఏఐ పయనీర్ సంస్థ సీఈవో దేసు ఉమా తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభించిన జెనెరేటివ్ ఏఐ ఎఫ్‌డీపీ వర్క్ షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మానవుడి మేధాశక్తి కన్నా, సాంకేతిక కృత్రిమ మేధకు శక్తి పదిరెట్లు ఉంటుందని తెలిపారు. 2030 నాటికి 10 లక్షల మంది విద్యార్థులను ఏఐలో ఇంజినీరింగ్ నిపుణులుగా తయారు చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. స్వల్ప కాలంలో మెరుగైన సత్ఫలితాలు ఏఐ టెక్నాలజీతోనే సాధ్యమని చెప్పారు. అన్ని రంగాలను ఏఐతో జత చేస్తూ సాంకేతిక సామర్థ్యంలో విప్లవాత్మక మార్పులను సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి కృత్రిమ మేధ ఉత్పత్తులు ఒక ట్రిలియన్‌కు చేరుకొనేలా ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వారి నిపుణుల ద్వారా తీవ్ర పరిశోధనలు చేస్తున్నాయని వివరించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని భారీ ప్యాకేజీలతో కూడిన ఉద్యోగ సాధన దిశగా కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేసేందుకు అధ్యాపక బృందం సిద్ధమవ్వాలని కోరారు. విద్యార్థులను అన్నివిధాలా భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధం చేయడమే తమ లక్ష్యమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేనిలు పేర్కొన్నారు. నిపుణులతో నిర్వహించే ఇలాటి శిక్షణ తరగతులు విద్యార్థులకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక విద్యను సులభతరం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం. శ్రీలత, డాక్టర్ ఎ.నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న దేసు ఉమా

వీవీఐటీలో గాయకుల సందడి



ఆలపిస్తున్న సింగర్స్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని: ప్రముఖ తెలుగు ఓటీటీ సంస్థ ఆహాలో ప్రసారం అవుతున్న సింగింగ్ రియాల్టీ షో 'తెలుగు ఇండియన్ ఐడల్' సీజన్ 3 పోటీదారులు వీవీఐటీలో మంగళవారం సందడి చేశారు. మండలంలోని నంబూరులో ఉన్న ప్రాంగణంలో కార్యక్రమ ప్రమోషన్లో భాగంగా సీజన్లో టాప్‌గా నిలిచిన అనిరుధ్, భరత్, కీర్తన, నజీరుద్దీన్‌లు విద్యార్థులతో ఆడిపాడారు. తమదైన గానంతో అలరించారు. విద్యార్థులు ఆద్యంతం ఉత్సాహంగా వారితో గొంతు కలిపారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్‌లకు మంగళవారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఎల్టీ, ఎనస్థీషియా టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, తదితర కోర్సుల్లో చేరేందుకు గత నెల 30న దరఖాస్తులకు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆగస్టు 6 వరకు గడువు ఇచ్చారు. సుమారు వంద సీట్లకు 600 మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ పాల్ సుధాకర్, ఏఓ సరోజ్ కుమారిలు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 5,500 గరిష్ఠం : రూ. 7,000

మోడల్ ధర రూ. 6,200